# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

<u>పత్రికా ప్రకటన</u>

**జూన్ 24, 2011**

## రాష్ట్రపతి చేసిన శాంతిచర్చల ప్రతిపాదన ప్రజలను పక్కదారి పట్టించే మరో మాయోపాయమే!

ఈరోజు, 2011 జూన్ 24న ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్ పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ 'మావోయిస్టులు హింసను విడనాడి చర్చల కోసం ముందుకు రావాల'నీ, 'జనజీవన స్రవంతిలో కలిసిపోయి ఆదివాసుల అభివృద్ధి కోసం పాటు పడాల'ని ప్రతిపాదన చేశారు. రాష్ట్రపతి నుండి ఈ ప్రతిపాదన వచ్చింది సరిగ్గా బస్తర్ ప్రాంతంలో భారత సైన్యానికి చెందిన దాదాపు వెయ్యి మంది జవాన్లు డేరా వేసి దేశంలోని అత్యంత పేద ప్రజలకు వ్యతిరేకంగా సాగుతున్న యుద్ధం - ఆపరేషన్ గ్రీన్ హంట్‌లో పాల్గొనబోతున్న సందర్భంలో. ఖనిజ సంపదలతో అలరారే దేశంలోని అనేక ప్రాంతాల్లోంచి సహజ వనరుల్ని కొల్లగొట్టడం కోసం ప్రభుత్వాలకూ, కార్పొరేట్ కంపెనీలకూ మధ్య ఎన్నో దఫాల చర్చలు పూర్తయ్యి, లక్షల కోట్ల రూపాయల ఎంవోయూలపై సంతకాలు జరిగిన నేపథ్యంలో రాష్ట్రపతి 'చర్చల' గురించి మాట్లాడుతున్నారు. మాడియా ఆదివాసీ సముదాయానికి చెందిన డజన్ల గ్రామాల్ని, వేలాది ప్రజల్ని లేకుండా చేస్తూ బస్తర్‌లో 750 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతాన్ని సైన్యానికి అప్పజెప్పాలని ఎలాంటి 'చర్చలు' జరపకుండానే నిర్ణయం తీసుకున్న సమయంలోనే సరిగ్గా ఆమె ఈ 'చర్చల' ప్రతిపాదన చేస్తున్నారు.

దేశంలో మొట్టమొదటి మహిళా రాష్ట్రపతి అయిన ప్రతిభా పాటిల్, ఇదే ఛత్తీస్‌గఢ్ దక్షిణ కొసకున్న తాడిమెట్ల, మొర్‌పల్లి, పులాన్‌పాడు, తిమ్మాపురం గ్రామాల్లో ప్రభుత్వ బలగాల చేతుల్లో పాశవిక అత్యాచారాలకు, హింసకు గురైన మహిళల దేహాలపై గాయాలైనా మానక ముందే హింస విడనాడాలని మాకు హితబోధ చేస్తున్నారు. ఇంకా కేవలం ఈ గ్రామాల్లోనే కాకుండా, దండకారణ్యంలో, బీహార్-ఝార్ఖండ్‌లో, ఒడిషాలో, మహారాష్ట్రలో, ఇంకా అనేక ప్రాంతాల్లో, ముఖ్యంగా మావోయిస్టు వుద్యమ ప్రాంతాల్లో లేదా ఆదివాసీ ప్రాంతాల్లో ప్రభుత్వ హింస ఒక దైనందిన వాస్తవంగా కొనసాగుతున్న సమయంలో ఆమె హింసను విడనాడమని మాకు చెబుతున్నారు. నిజానికి ప్రభుత్వ హింసకు బహురూపాలున్నాయి. వేర్వేరు సమయాల్లో అది వేర్వేరు విధాలుగా కొనసాగుతూ వుంటుంది. వుదాహరణకు ఇవ్వాళ్టి ఉదంతాన్నే తీసుకుంటే రాత్రికి రాత్రే కిరోసిన్‌పై రెండు రూపాయలు, డీజిల్‌పై మూడు రూపాయలు, వంటగ్యాస్‌పై 50 రూపాయల రేటు పెంచి ఇప్పటికే అధికధరల భారంతో మూల్గుతున్న పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచెయ్యడం రూపంలో కూడా ఈ హింసను మనం చూడొచ్చు. కానీ రాష్ట్రపతికి ఇలాంటి 'హింస'లతో ఏ సమస్యా లేదు.

ఇంకా భారత ప్రథమ పౌరురాలు మమ్మల్ని 'ప్రధాన స్రవంతి'లోకి రావాలని కూడా కోరుతున్నారు. ఆమె చెబుతున్న 'ప్రధాన స్రవంతి'కి చెందిన 'కథా నాయకుల్ని' - అవినీతిపరులు, కుంభకోణాల చరితులైన మంత్రుల్నీ, నాయకుల్నీ, కార్పొరేట్ తిమింగలాల్నీ, వాళ్ల దళారుల్నీ ఢిల్లీ నుండి పల్లెపట్టులోని గల్లీల దాకా ప్రజలంతా ఛీకొడుతున్నారు. ఆమె మమ్మల్ని రమ్మని పిలుస్తున్న 'ప్రధాన స్రవంతి'లో కార్మికులకూ, కర్షకులకూ, ఆదివాసులకూ, దళితులకూ, మైనారిటీలకూ, మహిళలకూ మొదలైన వాళ్లకు అన్యాయం, అత్యాచారాలు, అవమానాలు తప్ప మరేమి మిగల్లేదు.

ప్రతిభా పాటిల్ గారు మమ్మల్ని చర్చలకు రమ్మని పిలుస్తున్న నేపథ్యాన్ని గమనిస్తే, ఇలాంటి ప్రతిపాదనకు స్పందనగానే ప్రభుత్వానికి మా వైఖరిని వెల్లడించిన మా పార్టీ అధికార ప్రతినిధి, పోలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ ఆజాద్‌ను ఇదే ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేసింది. సందర్భవశాత్తు ఆయన తొలి వర్ధంతికి సరిగ్గా వారం రోజుల ముందు రాష్ట్రపతి ఈ ప్రతిపాదన చేస్తున్నారు. సంవత్సరం క్రితం దాదాపు ఇవే రోజుల్లో చిదంబరం, అతని హంతక ఇంటలిజెన్స్-పోలీసు జాగిలాల ముఠా ఆయన్ని చంపే కుట్రకు తుది రూపం ఇస్తూ వుండి వుంటారు. చర్చల పట్ల మా పార్టీ వైఖరి ఏమిటో కామ్రేడ్ ఆజాద్ దేశ, ప్రపంచ ప్రజల

ముందు స్పష్టంగా వుంచినందుకు ఈ రాష్ట్రపతి అధినాయకత్వం వహిస్తున్న రాజ్యం ఆయన హత్య ద్వారానే జవాబు చెప్పింది. ఆ తర్వాత కూడా ఎందరో సీనియర్ మావోయిస్టు నాయకుల్ని పట్టుకొని జైళ్లల్లో ఖైదు చేసే విధానాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తూనే వస్తున్నది. 60-70 సంవత్సరాల వయోవృద్ధ మావోయిస్టు నేతల్ని జైళ్లళ్లో బంధించి చిత్రహింసలకు గురి చేయడమే కాకుండా వాళ్లకు కనీస వైద్య సదుపాయాలు కూడా అందకుండా వేధిస్తున్నది. వాళ్లపై పదేసి, పదిహేనేసి రాష్ట్రాల్లో ఎన్నెన్నో తప్పుడు కేసుల్ని మోపి వాళ్లు జీవితాంతం చీకటి కొట్టాల్లోనే మగ్గిపోయేలా చేస్తున్నది.

**కనుక, దేశప్రజలందరికీ మా విజ్ఞప్తి ఇది -**

'శాంతి చర్చల' ప్రతిపాదన చేసే ముందర ప్రభుత్వం ప్రజలపై సాగిస్తున్న యుద్ధం - ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను నిలిపివెయ్యాలనీ, బస్తర్‌లో సైనిక శిక్షణను ఆపాలనీ, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలన్నిటి నుండి సైన్యాన్నీ, అర్ధసైనిక బలగాల్నీ వెనక్కి రప్పించమనీ రాష్ట్రపతి గారిని డిమాండ్ చేయండి. ఒకవేళ ప్రభుత్వం ఇందుకు సిద్ధమైతే ప్రజలు ఆత్మరక్షణార్థం చేస్తున్న ప్రతిహింస మరుసటి రోజు నుండే నిలిచిపోతుంది!

'అభివృద్ధి' గురించి మాట్లాడే ముందర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకూ, ప్రభుత్వాలకూ మధ్య జరిగిన ఎంవోయూలన్నీ రద్దు చేయాలనీ, బలవంతంగా భూముల్ని లాక్కునే ప్రాజెక్టులన్నిటినీ వెంటనే ఆపాలనీ, తమకెలాంటి అభివృద్ధి కావాలో నిర్ణయించుకునే హక్కు ప్రజలకే వుండాలనే విషయాన్ని ప్రభుత్వం ఒప్పుకోవాలనీ రాష్ట్రపతి గారిని డిమాండ్ చేయండి!

మావోయిస్టులు 'ప్రధాన స్రవంతి'లో చేరాలని కోరే ముందర ప్రభుత్వం అవినీతి-కుంభకోణాలకు పాల్పడ్డ వాళ్లందరినీ అరెస్టు చేసి శిక్షించాలనీ, విదేశీ బ్యాంకుల్లో వున్న నల్ల ధనాన్నంతా వెనక్కి తీసుకురావాలనీ, అవినీతిలో, అక్రమార్జనలో దోషులైన మంత్రుల్ని, నాయకుల్ని పదవుల్లోంచి తప్పించి బహిరంగంగా శిక్షించాలనీ రాష్ట్రపతి గారిని డిమాండ్ చేయండి!



(అభయ్)

అధికార ప్రతినిధి

కేంద్ర కమిటీ

సీపీఐ (మావోయిస్టు)